సాక్షి అనకాపల్లి

శుక్రవారం । 12 । జనవరి । 2024



ఘనంగా ధారోత్సవాలు

సింహాచలం సింహగిరిపై ఐదురోజులపాటు జరిగే ధారోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి.



విధి కాటేసింది..

రావికమతం మండలం మట్టవానిపాలేనికి చెందిన ఏడేళ్ల బాలుడు పాముకాటుతో మృతి చెందాడు.

8లో



వైభవంగా సహస్ర ఘటాభిషేకం

విశాఖ కరకమహాలక్ష్మి అమ్మవారి సన్నిధిలో మార్గశిర మాసోత్సవాలు గురువారంతో వైభవంగా ముగిశాయి.

8లో

న్యూస్‌రీల్

గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా కొండా రాజీవ్



సాక్షి, విశాఖపట్నం: విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా కొండా రాజీవ్ గాంధీ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ మాట్లాడుతూ తనని ఈ పదవిలో నియమించినందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రాజీవ్ గాంధీ వైఎస్సార్ సీపీలో రాష్ట్ర అధికార ప్రతినిధిగా పనిచేశారు. ప్రస్తుతం పార్టీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

విధుల్లో చేరిన మున్సిపల్ పారిశుధ్య కార్మికులు



నర్సీపట్నం మున్సిపాలిటీలో చెత్తను సేకరిస్తున్న పారిశుధ్య కార్మికులు

నర్సీపట్నం: మున్సిపల్ పారిశుధ్య కార్మికులు సమ్మె విరమించి విధుల్లో చేరారు. ప్రభుత్వంతో చరిపిన చర్చలు సఫలీకృతం కావడంతో తిరిగి వారు వీధులను శుభ్రపరిచే పని ప్రారంభించారు. దాంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పారిశుధ్య కార్మికుల సమ్మెతో వార్డుల్లో ఎక్కడి చెత్త అక్కడే నిలిచిపోయింది. ఓ పక్క పండగ సమీపిస్తుండడంతో పేరుకుపోయిన అపారిశుధ్యంతో అవస్థలు పడ్డారు. పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైనా హామీ ఇవ్వడంతో సమ్మె ముగిసింది. ప్రస్తుతం మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్య పనులు ఊపందుకున్నాయి.

పాడిరైతుల సంక్షేమానికి పథకాలు



కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్న విశాఖ డెయిరీ చైర్మన్ ఆనంద్‌కుమార్, ఎమ్మెల్యే గణేష్

మాకవరపాలెం: పాడిరైతుల సంక్షేమానికి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నామని విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ తెలిపారు. మండలంలోని తామరంలో రూ.27 లక్షల డెయిరీ నిధులతో నిర్మించిన కల్యాణ మండపాన్ని గురువారం ఆయన ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాడి రైతులు డెయిరీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం నర్సీపట్నం యూనిట్ పరిధిలో ఉన్న పాడి రైతులకు సంక్రాంతి బోనస్‌గా రూ.3 కోట్ల 72 లక్షల నగదు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్లు శీరంరెడ్డి సూర్యానారాయణ, రాజకుమారి, వైస్ ఎంపీపీ లక్ష్మి, తామరం సర్పంచ్ గొంతిన చెల్లారత్నం, హరిబాబు, డెయిరీ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి అధిక ప్రాధాన్యం

8లో

- ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర
- స్థాయీ సంఘ సమావేశాల్లో పలు అంశాలపై చర్చ







కశింకోటలో వేణుగోపాలస్వామికి పూలమాలలతో అలంకారం

వజ్ర కవచాలంకృతులుగా ధ్యాన వేంకటేశ్వరస్వామి, ఆండాళమ్మ అలంకారాలు

కూడారై కనువిందు

కశింకోట: కశింకోటలోని దేవదాయ, ధర్మదాయ శాఖకు చెందిన రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో గురువారం 'కూడారై' ఉత్సవం ఘనంగా నిర్వహించారు. గోదాదేవిని వివాహం చేసుకోవడానికి రంగనాథుడు అంగీకారం తెలిపిన రోజుగా ధనుర్మాసోత్సవాల్లో జరిపే ఈ వేడుక కనువిందు చేసింది. స్వామి మూల విరాట్‌ను అందంగా పూలమాలలతో అలంకరించి విష్ణు సహస్ర నామార్చన చేశారు. తిరుప్పావై, పాశుర విన్నపం పారాయణం చేశారు. ఆండాళమ్మ గోదాదేవి, వేణుగోపాలస్వామి విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కూడారైను పురస్కరించుకొని సంప్రదాయంగా డ్రై ఫ్రూట్స్ వినియోగించి బెల్లం, పంచదారలతో వేర్వేరుగా పెద్ద అండాలతో పాయసాన్ని తయారు చేసి స్వామికి నివేదించి పూజలు చేశారు. అనంతరం భక్తులకు పంపిణీ చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు, ఆలయ అర్చకుడు రేజేటి సీతారామాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో కూడా ధనుర్మాసోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి మూల విగ్రహాన్ని వజ్ర కవచాలంకృతులను చేసి విష్ణు సహస్ర నామార్చనలు, పాశుర విన్నపం, తిరుప్పావై నిర్వహించారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

తగ్గేదేలే..

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో 4వ ర్యాంకు





కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, మేయర్ హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, అదనపు కమిషనర్ సన్యాసిరావు, సీఈ రవికృష్ణరాజు, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్

- 4472 నగరాలతో పోటీ పడి ర్యాంక్ సాధించిన విశాఖ
- రాష్ట్రం నుంచి టాప్–1లో నిలిచిన జీవీఎంసీ
- గార్బేజ్ రేటింగ్‌లో 5 స్టార్ రేటింగ్
- వాటర్ ప్లస్‌లో గుర్తింపు పొందిన మహానగరం

విశ్వ విశాఖ.. మరోసారి కీర్తి పతాక ఎగరేసింది. స్వచ్ఛ సర్వేక్షణ్–2023లో నాల్గో ర్యాంకు సాధించి జాతీయ స్థాయిలో మరోమారు మెరిసింది. 2018–19లో 23వ ర్యాంక్‌కు పడిపోయిన విశాఖ.. పడిలేచిన కెరటంలా దూసుకొచ్చింది. రెండేళ్ల కిందట 9వ ర్యాంక్ సాధించిన జీవీఎంసీ గతేడాది 4వ ర్యాంకుకు ఎదిగింది. తాజాగా అఖిలభారత స్థాయిలో ఆ స్థానాన్ని నిలబెట్టుకుంది. పారిశుధ్యం నిర్వహణ, మౌలిక సదుపాయాల కల్పన, మరుగుదొడ్ల నిర్వహణ, రవాణా వ్యవస్థ, పర్యావరణ పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలు, ప్లాస్టిక్ నిషేధం తదితర వాటిని పరిశీలించిన కేంద్ర ప్రభుత్వం..
ఈ ర్యాంకును ప్రకటించింది. అలాగే చెత్త రహిత నగరాల్లో విశాఖపట్నం 5 స్టార్ రేటింగ్ సాధించింది. వాటర్ ప్లస్ సర్టిఫికేషన్‌లో కూడా జీవీఎంసీ గుర్తింపు పొందింది. – డాబాగార్డెన్స్ (విశాఖ)

దేశ వ్యాప్తంగా పరిశుభ్రమైన నగరాలకు ఏటా కేంద్ర ప్రభుత్వం ర్యాంకులు అందజేస్తోంది. నగరాల్లో ఉండే మౌలిక సదుపాయాలు, పారిశుధ్యం నిర్వహణ, బహిరంగ మలమూత్ర విసర్జన నిర్మూలన, ఇళ్లల్లో మరుగుదొడ్ల నిర్మాణం, రవాణా వ్యవస్థ, చెత్త శుద్ధి, బీచ్ క్లీన్, పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ నిషేధం తదితర అంశాలను పరిగణలోకి తీసుకొని ‘స్వచ్ఛ’ అవార్డులకు నగరాలకు ఎంపిక చేస్తోంది. ఈ క్రమంలో ఈ ఏడాదికి గానూ గురువారం దేశ రాజధాని ఢిల్లీలో స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకులు ప్రకటించారు. 2022–23కి గానూ 4,472 సిటీస్‌తో తలపడిన విశాఖ మహా నగరం.. మరోసారి సత్తా చాటి టాప్–5 నగరాల జాబితాలో నిలిచింది. గతేడాది 4వ స్థానంలో నిలిచిన జీవీఎంసీ ఈ ఏడాది కూడా అదే(4వ స్థానం) స్థానం సాధించింది. ఇండోర్(మధ్యప్రదేశ్), సూరత్(గుజరాత్), నవీ ముంబయి(మహారాష్ట్ర) తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. తర్వాత స్థానంలో మన విశాఖ నిలవడం మనందరికీ గర్వకారణం.

ఫలించిన ‘స్వచ్ఛ’ ప్రయత్నం

జీవీఎంసీ అధికారులు, పారిశుధ్య సిబ్బంది, నగర ప్రజల ప్రయత్నం ఫలించింది. విశాఖ నాల్గో ర్యాంకు సాధించడంపై నగర ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో గురువారం ఢిల్లీలో నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్–2023లో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, అదనపు కమిషనర్ డాక్టర్ సన్యాసిరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, ప్రధాన ఇంజినీర్ రవికృష్ణరాజు తదితరులు కేంద్ర గృహ పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి చేతుల మీదుగా అవార్డులు స్వీకరించారు. ఏఎంవోహెచ్ డాక్టర్ కిరణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, వార్డు సెక్రటరీ, పారిశుధ్య కార్మికుడు ఢిల్లీ వెళ్లిన బృందంలో ఉన్నారు.



యంత్రాల ద్వారా బీచ్ క్లీనింగ్

స్వచ్ఛతలో విశాఖ మెరిసిందిలా...

సంవత్సరం	ర్యాంకు
2018-19	23
2019-20	09
2020-21	09
2021-22	04
2022-23	04

శతశాతం క్లీన్ సిటీ విశాఖ

స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీ నిబంధనలను జీవీఎంసీ 100 శాతం పాటిస్తుంది. పారిశుధ్యం నిర్వహణలో రాజీ పడటం లేదు. గత ర్యాంక్‌ను అధిగమించిందుకు వినూత్న చర్యలు చేపట్టాం. వచ్చే ఏడాది మరింత మెరుగైన ర్యాంకు కోసం ఇప్పటినుంచే చర్యలు చేపడతాం. పారిశుధ్య కార్మికులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఏఎంహెచ్‌వోలు, జెడ్సీలు, నివాసిత సంక్షేమ సంఘాలు, స్వచ్ఛ విశాఖ అంబాసిడర్‌లు, ఎన్జీవోల సమష్టి కృషితో ఈ ర్యాంక్ సొంతం చేసుకున్నందుకు సంతోషంగా ఉంది.

– డాక్టర్ నరేష్‌కుమార్, జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి

8879.25 / 9500

స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్స్–2023లో 9500 స్కోర్‌కి 8879.25 మార్కులను విశాఖ సాధించింది.

విభాగం	మొత్తం మార్కులు	సాధించిన మార్కులు
సర్వీస్ లెవల్ ప్రోగ్రెస్	4830	4529.13
సర్టిఫికేషన్	2500	2300.00
సిటిజన్ వాయిస్	2170	2050.12



సమష్టి కృషితో ర్యాంక్ సాధించాం



స్వచ్ఛ సర్వేక్షణ్–2023లో జీవీఎంసీ 4వ స్థానం సాధించడం ఎంతో సంతోషంగా ఉంది. ఈ ర్యాంక్ సాధించడంలో జీవీఎంసీ యంత్రాంగం, స్వచ్ఛ భారత్ అంబాసిడర్‌లు, ప్రజా ప్రతినిధులు, కార్పొరేటర్లు, సెలబ్రిటీలు, ఆర్‌డబ్ల్యూఎస్, వివిధ స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార సంస్థలు, విద్యా సంస్థలు, పరిశ్రమల యాజమాన్యాలు, నగర పౌరుల కృషి ఉంది. డిప్యూటీ మేయర్లు, అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లు, కార్పొరేటర్లు, జీవీఎంసీ అన్ని విభాగాల ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులకు శుభాకాంక్షలు. ఇదే స్ఫూర్తితో నగరాన్ని మరింత సుందరంగా ఉంచేందుకు అను నిత్యం కృషి చేస్తాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖపై ప్రత్యేకంగా దృష్టి సారించి.. అభివృద్ధి చేస్తున్నారు. నగర ప్రజలందరూ భవిష్యత్‌లో కూడా పారిశుధ్య నిర్వహణకు సహకరించాలి. స్వచ్ఛ సర్వేక్షణ్ 2024లో విశాఖను మొదటి ర్యాంక్‌లో నిలిపేందుకు అందరం కలిసి ముందుకు సాగుదాం.

– గొలగాని హరి వెంకటకుమారి, మేయర్

నగర ప్రజలకు ఈ అవార్డు అంకితం



స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విశాఖ దేశంలోనే టాప్–5లో నిలవడం గర్వంగా ఉంది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అధ్యక్షతన కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీ చేతులమీదుగా అవార్డు అందుకున్నాం. ఈ అవార్డును నగర ప్రజలకు అంకితం చేస్తున్నాం. విశాఖ నగర ప్రజల సహకారంతోనే ఈ ర్యాంక్ సాధ్యమైంది. ఇందులో మేయర్ గొలగాని హరివెంకటకుమారి, పాలక మండలి, అధికారులు, సిబ్బంది, ఆర్‌డబ్ల్యూఎస్, నేవల్, పోలీస్, విద్యాసంస్థలు, ఎన్జీవోల కృషి ఉంది. 2024లో టాప్–1లో నిలిచేందుకు నిరంతరం శ్రమిస్తాం. కేవలం ర్యాంకు కోసమే కాకుండా.. ప్రజలకు సౌకర్యవంతమైన, ఆరోగ్యకరమైన జీవనం అందించేందుకు నిరంతరం పాటుపడతాం.

– సాయికాంత్‌వర్మ, జీవీఎంసీ కమిషనర్

అంబేడ్కర్ జీవితం స్ఫూర్తిదాయకం

- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి
- ఆకట్టుకున్న ఫొటో ఎగ్జిబిషన్



అంబేడ్కర్ ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎంపీపీ గొర్లి సూరిబాబు

తుమ్మపాల: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆదర్శనీయుడని, ఆయన జీవిత ఘట్టాలు అందరికీ స్ఫూర్తిదాయకమని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. పట్టణంలో ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో సామాజిక సమతా సంకల్పం కార్యక్రమంలో భాగంగా గురువారం అంబేడ్కర్ ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ ఛాయా చిత్రాల ప్రదర్శనను కలెక్టర్ ప్రారంభించారు. అంబేడ్కర్ జననం, బాల్యం, విద్యాభ్యాసం, వివాహం, రాజ్యాంగ రచన, వివిధ ఘట్టాలకు సంబంధించిన ఫొటోలను ఇక్కడ ప్రదర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచిన అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 19న విజయవాడలో 125 అడుగుల విగ్రహం, ఆ మహనీయుని సేవలకు ప్రతిరూపంగా నిర్మించిన స్మృతివనాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. జిల్లాలో అన్ని గ్రామ సచివాలయాలు, మండలం, జిల్లా స్థాయిల్లో జన్ భాగిదారి కార్యక్రమం కింద ఈ నెల 9 నుంచి 12 వరకు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తారన్నారు. ప్రతి గ్రామ సచివాలయ పరిధిలోని అంబేడ్కర్ విగ్రహాలను శుభ్రం చేసి ఘనంగా నివాళులర్పిస్తామన్నారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వరాహ సత్యవతి, ఎంపీపీ గొర్లి సూరిబాబు, గ్రామ వార్డు సచివాలయాల ప్రత్యేకాధికారి మంజులవాణి, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ అజయ్‌బాబు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా విగ్రహావిష్కరణ

అనకాపల్లి: రాష్ట్ర ప్రభుత్వం విజయవాడలో ఏర్పాటు చేసిన 125 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఈనెల 19న ఘనంగా ఆవిష్కరిస్తారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అన్నారు. రింగ్‌రోడ్డులోని మంత్రి అమర్‌నాథ్ కార్యాలయంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు ఆధ్వర్యంలో నియోజకవర్గ పార్టీ నాయకులతో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో



సమావేశంలో మాట్లాడుతున్న బొడ్డేడ ప్రసాద్

72 సచివాలయాల పరిధిలో ప్రతి సచివాలయం నుంచి ఏడుగురు వ్యక్తుల చొప్పున ఈనెల 19న విజయవాడలో జరిగే అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి వెళుతున్నట్టు ఆయన తెలిపారు. నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ మాట్లాడుతూ బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనార్టీ వర్గాల ప్రజలకు మన ప్రభుత్వంలోనే సామాజిక న్యాయం జరిగిందన్నారు. ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సూరిశెట్టి రమణఅప్పారావు, వైద్యవిభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డేడ లక్ష్మీనరసింహరావు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు ‘జగనన్న తోడు’



లబ్ధిదారులకు నమూనా చెక్కు అందిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ సత్యవతి

- 13,244 మందికి రూ.14.01 కోట్ల రుణాలు
- 18,376 మందికి రూ.30.67 లక్షల వడ్డీ రాయితీ

తుమ్మపాల: చిరు వ్యాపారులు, సంప్రదాయ వృత్తుల వారి ఉపాధికి ఊతంగా ‘జగనన్న తోడు’ పథకం నిలుస్తోందని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. జగనన్న తోడు పథకంలో భాగంగా చిరు వ్యాపారులకు వడ్డీ లేని రుణాలు, రుణాలు పొంది సకాలంలో చెల్లించినవారికి వడ్డీ రాయితీ పంపిణీ కార్యక్రమాన్ని తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వరాహ సత్యవతి, అధికారులు, లబ్ధిదారులు వీక్షించారు. అనంతరం లబ్ధిదారులకు రూ.14 కోట్ల ఒక లక్ష 33 వేల నమూనా చెక్కును అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న తోడు పథకం 8వ విడత కింద జిల్లాలో 13,244 మంది లబ్ధిదారులకు ఈ సొమ్మును వారి ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. ఈ పథకం కింద రుణాలు పొంది సకాలంలో చెల్లించిన 18,376 మంది లబ్ధిదారులకు వడ్డీ రీయింబర్స్‌మెంట్ కింద రూ.30 లక్షల 66 వేల 863లు జమ అయ్యిందన్నారు. డీఆర్‌డీఏ పీడీ కె.శచీదేవి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

14న పలువురికి సేవా పురస్కారాలు

అనకాపల్లి : నిస్వార్థసేవలు అందిస్తున్న ప్రముఖులను ప్రతి ఏటా భోగి రోజు డాక్టర్ కొణతాల రామలింగస్వామి మెమోరియల్ ట్రస్టు తరఫున సత్కరిస్తున్నట్లు ట్రస్టు అధ్యక్షురాలు కొణతాల లక్ష్మీపార్వతి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గత నాలుగేళ్లుగా ఉపాధ్యాయరంగం ఒకరిని, ఉత్తమ విద్యార్థిని, ఉత్తమ సేవకులు ఐదుగుర్ని ఈ ఏడాది కూడా తెలుగురాష్ట్రాల నుంచి ఎంపిక చేయడం జరిగిందని పేర్కొన్నారు. స్థానిక ఉప్పల చంద్రశేఖర్ కల్యాణమండపంలో ఈనెల 14వతేదీ సాయంత్రం 5 గంటలకు ఉత్తమ ఉపాధ్యాయుడు చిలుకూరి శ్రీనివాసరావు(తూర్పుగోదావరి జిల్లా కడియం), ఉత్తమ సంఘ సేవకులు పి.సత్య తిరుపతిరావు పటానాయక్ (అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం), రాపర్తి జగదీష్‌కుమార్ (విజయనగరం జిల్లా, మంగళపాలెం), మార్గం రాజేష్(తెలంగాణరాష్ట్రం, హైదరాబాద్, అనాథ విద్యార్థి గృహం), సురకాసి రవితే(విశాఖపట్నం, ఆకాంక్ష చిల్డ్రన్స్ ఫౌండేషన్), జీరెడ్డి తరుణ్‌కుమార్(అనకాపల్లి, సదాఫౌండేషన్), ఉత్తమ విద్యార్థి విల్లూరి భార్గవ్ (ట్రిపుల్ ఐటీ కోల్‌కత్తా ఎంబీఏ)లకు పురస్కారంతో సత్కరిస్తున్నామన్నారు.

నాగులాపల్లి ధ్యాన కేంద్రంలో జర్మనీ పిరమిడ్ మాస్టర్లు



సీనియర్ పిరమిడ్ మాస్టర్లు మధు, రామ్‌లకు సత్కారం

మునగపాక: నాగులాపల్లి చంద్రశేఖర మహాస్వామి ధ్యాన కేంద్రాన్ని గురువారం జర్మనీ నుంచి వచ్చిన సీనియర్ పిరమిడ్ మాస్టర్లు మధు, రామ్ సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ ధ్యానం అలవాటు చేసుకోవాలన్నారు. ఇక్కడి పిరమిడ్ ధ్యాన కేంద్రం ద్వారా అందుతున్న సేవలను గుర్తించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రపంచమంతా నేడు ధ్యానంపై ఆసక్తి చూపుతున్నారన్నారు. ధ్యాన గురువులు శ్రావణి, శివాజీ, అనిల్, సత్యనారాయణ, జానకి, ప్రసాదరావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. తెలుగువారైన పిరమిడ్ మాస్టర్లు మధు, రామ్ జర్మనీలో స్థిరపడి ప్రపంచమంతటా ధ్యానం నేర్పుతున్నారు.

ఆత్మచిత్రం పుస్తకావిష్కరణ

సీతంపేట (విశాఖ): సీబీసీఐడీ విభాగంలో ఏడీజీగా పని చేస్తున్న కిల్లాడ సత్యనారాయణ అనువాద రచన ×ఆత్మచిత్రం×పుస్తకావిష్కరణ సభ గురువారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో జరిగింది. విశ్వ కల్యాణ భారతి సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు.

సంక్షేమం, అభివృద్ధికి అధిక ప్రాధాన్యం





సమావేశానికి హాజరైన సభ్యులు, అధికారులు, మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, చిత్రంలో సీఈవో పోలినాయుడు

- ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర
- స్థాయీ సంఘ సమావేశాల్లో పలు అంశాలపై చర్చ

మహారాణిపేట (విశాఖ): సంక్షేమం, అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యమివ్వాలని, సామాన్య ప్రజల ఆర్థిక పురోగతికి తోడ్పాటు అందించాలని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లపల్లి సుభద్ర సూచించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ఆమె అధ్యక్షతన ఒకటి నుంచి ఏడు వరకు స్థాయీ సంఘ సమావేశాలు జరిగాయి. వీటిలో అభివృద్ధి పనులు, ప్రణాళికలు, ఆర్థిక సాయం, సంక్షేమం, ఆరోగ్యం తదితర అంశాలపై చర్చించారు. ఆయా శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను అధికారులు చదివి వినిపించారు. వాటిపై సభ్యులు పలు ప్రశ్నలు లేవనెత్తగా ఆయా శాఖల అధికారులు సమాధానాలు ఇచ్చారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ ఇప్పటి వరకు తీసుకున్న, చేపట్టనున్న చర్యలను వివరించారు. ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ ఫలాలు అర్హులకు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో పని చేస్తున్న వారికి అండగా నిలవాలని పేర్కొన్నారు. మైదాన ప్రాంతాల్లో మాదిరిగా పాడేరు, అరకు ప్రాంతాల్లో కూడా మహిళా మార్ట్‌లను ప్రారంభించాలని డీఆర్డీఏ పీడీకి సూచించారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టే పనుల్లో మరింత నాణ్యత ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు అధిక ప్రాధాన్యమిస్తూ పూడిక తొలగింపు, కాలువలు శుభ్రత చేపట్టాలని సూచించారు. అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లులు త్వరితగతిన మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. యువతకు స్థానిక పరిశ్రమల్లో ఉపాధి కల్పించాలని చెప్పారు. కొన్ని మండలాల్లో దిగువ స్థాయి అధికారులు, సిబ్బంది పనితీరు బాగోలేదని సభ్యులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై విచారించి చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈవోను ఆదేశించారు. సభ్యుల సూచన మేరకు బెల్టు షాపులపై దృష్టి సారించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు. మినీ గోకులాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.

వారంలో బిల్లుల మంజూరు

15వ ఆర్థిక సంఘం కాల పరిధిలో చేపట్టే పనులకు వారం రోజుల్లోపే బిల్లులు మంజూరు చేస్తామని జెడ్పీ సీఈవో ఎం. పోలినాయుడు తెలిపారు. ఆయా పనులను వీలైనంత త్వరగా ప్రారంభించాలని కోరారు. ప్రారంభ, మధ్యస్థ పనులకు సంబంధించి వేర్వేరుగా ఎం.బుక్‌లు సమర్పించినా బిల్లులు మంజూరు చేస్తామని వెల్లడించారు. పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా, ఇరిగేషన్ విభాగాల్లో చేపట్టే పనులకు అధిక ప్రాధాన్యం ఉంటుందని ఆయన చెప్పారు.

ఉపాధి హామీ బిల్లులు చెల్లించాలి

పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ పథకం బిల్లులు తక్షణం చెల్లించాలని పలువురు సభ్యులు కోరారు. చాలా కాలం నుంచి ఈ బిల్లులు రాలేదని, అలాగే కాంపోనెట్ కూడా విడుదల కాలేదని అనంతగిరి జెడ్పీటీసీ గంగరాజు, గొలుగొండ జెడ్పీటీసీ గిరిబాబు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. నాడు–నేడు పనులకు తక్షణం బిల్లులు మంజూరు చేయాలని పలువురు జెడ్పీటీసీలు కోరారు. సమావేశంలో జెడ్పీ డిప్యూటీ సీఈవో సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటే ప్రజలు క్షమించరు

- అయ్యన్నపై నిప్పులు చెరిగిన ఎమ్మెల్యే గణేష్
- వచ్చే ఎన్నికల్లో ప్రజలు తరిమికొడతారని హెచ్చరిక



సమావేశంలో మాట్లాడుదుతున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం : అభివృద్ధిని అడ్డుకుంటున్న మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడుని వచ్చే ఎన్నికల్లో ప్రజలు తరిమి తరిమి కొడతారంటూ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ నిప్పులు చెరిగారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేని అయ్యన్నపాత్రుడు రోలుగుంటకు చెందిన కాంట్రాక్టర్ నాయుడుతో హైకోర్టులో కేసు వేయించి స్టే తీసుకువచ్చారని అన్నారు. మున్సిపాలిటీలో 17 సచివాలయాలు ఉంటే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మొదటి విడతలో ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షలు చొప్పున రూ.3.40 కోట్లు, అదనంగా ఒక్కో సచివాలయానికి రూ.30 లక్షలు కావాలని సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని కోరడంతో రూ.5.10 కోట్లు మంజూరు చేశారన్నారు. ఈ నిధులతో మున్సిపాలిటీలో పెద్ద ఎత్తున పనులు జరుగుతుంటే అయ్యన్నపాత్రుడు ఓర్వలేకపోతున్నారన్నారు. అభివృద్ధిని గాలికి వదిలేసిన ఆయన తాము చేస్తున్న అభివృద్ధిని అడ్డుకుంటున్నారని అన్నారు. ఆయన చేస్తున్న దుర్మార్గమైన పనులను ప్రజలు గమనిస్తున్నారన్నారు. స్టే తీసుకువచ్చిన 38 పనుల్లో ఇప్పటికే దేవుని దయవల్ల 35 పనులు పూర్తి చేశామన్నారు. పనులు ఆగిపోతే తద్వారా ప్రయోజనం పొందాలని చూస్తున్నారని మండిపడ్డారు. రూ.16.60 కోట్లతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మెయిన్ రోడ్డు విస్తరణను సైతం అడ్డుకునేందుకు కొంత మంది భవన యజమానులతో కేసులు వేయించారన్నారు. ఆఖరికి రోడ్డు విస్తరణకు అడ్డంకిగా మారిన అయ్యప్పస్వామి ఆలయానికి స్టే తీసుకువచ్చి విస్తరణను అడ్డుకోవాలని చూసారన్నారు. అయ్యన్నపాత్రుడు కొబ్బరికాయ కొట్టి వదిలేసిన వేంకటేశ్వరస్వామి రోడ్డును విస్తరిస్తున్నామన్నారు. అయ్యన్నపాత్రుడు ఎన్ని కుయుక్తులు పన్నినా అభివృద్ధి పనులు ఆగవని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

విధి కాటేసింది..

- ఆటకు వెళ్లి విగత జీవిగా మారిన బాలుడు
- పాముకాటుతో ఏడేళ్ల చిన్నారి మృతి



గిరిధర్ (ఫైల్)

రావికమతం: అమ్మా.. చేలోకి వెళ్లి వస్తా.. అంటూ ఆడుతూ పాడుతూ వెళ్లిన కన్నబిడ్డ నురగలు కక్కుతూ రావడం.. కాసేపట్లోనే విగత జీవిగా మారడంతో ఆ తల్లిదండ్రుల వేదన కట్టలు తెంచుకుంది. వారి రోదన చూపరులకు సైతం కన్నీరు తెప్పించింది. ఈ దుర్ఘటనతో మండలంలోని మట్టవానిపాలెం విషాదంలో మునిగిపోయింది. అందరినీ తాత, మావయ్యా.. అంటూ నోరారా పలకరించే గిరిధర్ ఇక లేడన్న వార్తను వారు జీర్ణించుకోలేకపోతున్నారు. మట్టవానిపాలెం గ్రామానికి చెందిన గల్లా మహేష్, మహలక్ష్మమ్మ రెండో కుమారుడు గిరిధర్ (7) ఆ గ్రామంలోని పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నాడు. గురువారం చేలోకి వెళ్లి వస్తానంటూ అమ్మ లక్ష్మమ్మతో చెప్పి వెళ్లాడు. పొలంలో పాక పక్కనే పొలానికి మందు పిచికారి చేసే మిషన్ ఉంటే దాని వద్దకు వెళ్లగా అక్కడే పొంచి ఉన్న నాగుపాము గిరిధర్‌ను కాటేసింది. బాలుడు గట్టిగా కేకలు వేయడంతో సమీపంలో ఉన్న అతని తండ్రి మహేష్ పరుగున వచ్చి హుటాహుటిన గ్రామానికి తీసుకువచ్చారు. చొంగలు కార్చుతున్న కుమారుని చూసి అంతా తల్లడిల్లిపోయారు. 108 వాహనంలో చికిత్స చేస్తూనే రావికమతం ఆస్పత్రికి తరలించి ఇంజక్షన్ చేశారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి నర్సీపట్నం ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే గిరిధర్ మృతి చెందాడు. నర్సీపట్నం ఆస్పత్రిలోనే పోస్టుమార్టం కోసం బాలుడి మృతదేహాన్ని ఉంచారు. తల్లితండ్రులు, బంధువులు, గ్రామస్తులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

ఆధ్యాత్మిక సిరులు

- భక్తి శ్రద్ధలతో మేలుకొలుపులు
- ఆదర్శంగా మునగపాక పల్లపువీధి వినాయక కమిటీ
- ఆధ్యాత్మిక సేవలు



మునగపాక సాయిబాబా ఆలయంలో భజనలు



గౌరీపరమేశ్వరుల ఆలయంలో భక్తుల సంకీర్తనలు

మునగపాక : ఈ గ్రామం ఉద్యమాలకే కాదు... ప్రజల్లో భక్తి భావాలను పెంచడంలోనూ ముందుంటుంది. ఏ కార్యక్రమం తలపెట్టినా అంకితభావంతో పనిచేయడం ఈ ప్రాంత ప్రజల ఆకాంక్ష. పిల్లల నుంచి యువకులు, పెద్దలు తాము చేపట్టిన కార్యక్రమం విజయవంతం చేయడంలో కృషి చేస్తారు. ఆ గ్రామం పేరు మునగపాక. ధనుర్మాసం వచ్చిందంటే చాలు మునగపాకలోని పల్లపు వీధి వినాయక ఆలయ ప్రాంగణంలో యువకులు మేలుకొలుపులకు ప్రాధాన్యం ఇస్తారు. నెల రోజుల పాటు మేలుకొలుపుల కార్యక్రమం నిర్వహించడం అనాదిగా వస్తుంది. 1952 నుంచి అప్పటి పెద్దలు శివకోటి సాంబశివరావు తదితరులు పది మందితో కలసి మేలు కొలుపుల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. క్రమేణా 75 మందికి పైగా పిల్లలు, యువకులు మేలుకొలుపుల కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ప్రతిరోజూ ఉదయం 4.30 గంటలకు భక్తులంతా చన్నీటి స్నానమాచరించి శివపార్వతుల చిత్రపటంతో డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపు నిర్వహిస్తున్నారు. పల్లపు వీధిలోని వినాయక గుడి నుంచి ప్రారంభమయ్యే మేలుకొలుపు సాంబశివుని ఆలయం, సంతబయిల వినాయక గుడి, రామాలయం, పంచాయతీ వీధిలోని రామాలయం, గౌరీ పరమేశ్వరుల ఆలయం, నందీశ్వర ఆలయం, సాయిబాబా ఆలయం, మెయిన్‌రోడ్డులోని అభయాంజనేయ స్వామి ఆలయాలకు భజనలు చేసుకుంటూ దేవతామూర్తులను నిద్రలేపుతారు. చివరలో వినాయకుని గుడి వద్ద అల్పాహారం తీసుకొని ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోతారు. నెలరోజుల పాటు నిర్వహించే మేలుకొలుపులో భాగంగా భోగిపండగ రోజున వినాయక గుడి ప్రాంగణంలో భారీ అన్న సమారాధన ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. తద్వారా మేలుకొలుపు కార్యక్రమం దిగ్విజయంగా ముగుస్తుంది.

క్రమం తప్పకుండా...



క్రమం తప్పకుండా మేలుకొలుపు కార్యక్రమంలో పాల్గొంటున్నాను. పెద్దలు ఎంతో ఆశయంతో ప్రారంభించిన మేలుకొలుపు కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నాం. గ్రామం సస్యశ్యామలంగా ఉండేందుకు మేలుకొలుపుల కార్యక్రమం దోహదపడుతుంది.

–సూరిశెట్టి అప్పలనాయుడు, మునగపాక

మంచి సంప్రదాయం



ప్రజల ఆరోగ్యానికి మేలుకొలుపుల కార్యక్రమం ఉపయోగకరంగా ఉంటుంది. ప్రతి రోజూ తెల్లవారు నిద్రలేచాక చన్నీటి స్నానమాచరించి భజనలు చేస్తూ దేవతామూర్తులను మేలుకొలపడం మంచి సంప్రదాయం.

–సూరిశెట్టి గంగ శివనాయుడు, మునగపాక

14న సింహగిరిపై సంక్రాంతి సంబరాలు

సింహాచలం: సింహగిరిపై ఈ నెల 14న సంక్రాంతి సంబరాలను విశేషంగా నిర్వహిస్తున్నట్లు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. సంబంధిత ఏర్పాట్లపై గురువారం ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ తెలుగు సంస్కృతిని, గ్రామీణ జీవన విధానాన్ని ప్రతిబింబించేలా సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తామన్నారు. ఆ రోజు ఉదయం రాజగోపురం ఎదురుగా ఉన్న మాడ వీధిలో పెద్ద ఎత్తున భోగి మంట వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. గొబ్బెమ్మలతో ముత్యాల ముగ్గులు, డూడూ బసవన్నల విన్యాసాలు, జంగమ దేవర, కొమ్మదాసరి, హరిదాసు వేషధారణలు, కపిలగోవు, ఎడ్లబండి, పూరిళ్లు, కుండల ప్రదర్శనలు ఉంటాయన్నారు. గోపూజలు నిర్వహిస్తామన్నారు. ఆ రోజు 9గంటలకు చిన్నపిల్లలకు భోగిపళ్లు పోసే కార్యక్రమం నిర్వహిస్తామని, ఆసక్తి గల తల్లిదండ్రులు తమ పిల్లలను సింహగిరిపై ఉన్న నృసింహమండపంలోకి తీసుకురావాలని తెలియజేశారు.

యువకుని అనుమానాస్పద మృతి



మృతుడు పత్తి ప్రశాంత్

చోడవరం రూరల్: ఇరవై నాలుగేళ్ల యువకుడు ఒక ప్రైవేటు భవనం కిటికీ ఇనుప గ్రిల్‌కు ఉరి వేయబడి విగతజీవిగా ఉన్న సంఘటన గురువారం చోడవరంలో కలకలం రేపింది. చోడవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరావు కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. స్థానికంగా ఒక కూరగాయల దుకాణంలో పనిచేస్తున్న బుచ్చియ్యపేట మండలం వడ్డాది గ్రామానికి చెందిన పత్తి ప్రశాంత్ (24) గాంధీగ్రామం పంచాయతీ పరిధిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల వెనుక ప్రాంతంలో ఉన్న ఒక ప్రైవేటు భవనం ఇంటి బయటవైపు ఇనుప కిటికీ గ్రిల్‌కు లుంగీపంచెతో మెడకు ఉరివేయబడి వేలాడుతుండడాన్ని చూసిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నేలకు అందినంత మేరలో ఉరివేయబడి ఉండడంతో అతనిది ఆత్మహత్యా, హత్యా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మృతుడు బుధవారం సాయంత్రం అనకాపల్లి మార్కెట్‌కు వెళ్లి వచ్చి చోడవరంలో ఉండిపోయాడు. ఆ రాత్రి తన తల్లి పార్వతమ్మతో ఫోన్ ద్వారా మాట్లాడాడు. ఉదయానికి విగతజీవిగా కనిపించేసరికి తల్లిదండ్రులు, అక్కచెల్లెళ్లు తల్లడిల్లారు. చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు, ఎస్‌ఐ బి.అప్పలనాయుడులతో పాటు సంఘటన అనుమానాస్పదంగా ఉండడంతో అనకాపల్లి డీఎస్పీ సుబ్బరాజు సంఘటన స్థలికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీమ్‌ను, డాగ్ స్క్వాడ్‌లను రప్పించి వివరాలు సేకరిస్తున్నారు.

బీహార్ వాసి ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ దాడి మోహన్‌రావు

అనకాపల్లి : పట్టణంలో జాతీయ రహదారి ఆవఖండం పొలాల్లో బీహార్ రాష్ట్రం జయ జిల్లాకు చెందిన పర్స్ మంజీ (39) చెట్టుకు చొక్కా బిగించుకొని ఉరి వేసుకుని గురువారం బలన్మరణానికి పాల్పడ్డాడు. అటుగా పొలానికి వెళ్తున్న రైతులు గమనించి తమకు సమాచారం అందించినట్టు సీఐ దాడి మోహన్‌రావు పేర్కొన్నారు. దీంతో హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద లభించిన ఆధారాల ద్వారా మంజీ తండ్రి రాంప్రాసాకు ఫోన్ చేసి తెలియజేశామని, కుటుంబసభ్యులు శుక్రవారం ఉదయం అనకాపల్లి చేరుకుంటారన్నారు. మృతదేహాన్ని ఎన్టీఆర్ వైద్యాలయానికి పోస్టుమార్టం నిమిత్తం తరలించామని, వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు. ఆయన వెంట ఎస్‌ఐ సత్యనారాయణ, సిబ్బంది ఉన్నారు.

హిందీ విభాగం సేవలు భేష్

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్, హిందీ విభాగం సేవలు ప్రశంసనీయమని వాల్తేర్ డివిజన్ డీఆర్‌ఎం సౌరబ్ ప్రసాద్ కొనియాడారు. డివిజన్ పరిధిలో హిందీ భాషా వ్యాప్తి ముఖ్య ఉద్దేశంతో రాజభాషా(హిందీ)విభాగం నూతనంగా రూపొందించిన హిందీ క్యాలెండర్‌ను డీఆర్‌ఎం తన కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందీ విభాగం కేవలం హిందీ భాషావ్యాప్తి కోసమే కాకుండా, కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధికి సైతం విశేష కృషి చేస్తోందన్నారు. ఏడీఆర్‌ఎం మనోజ్‌కుమార్ సాహు, హిందీ అధికారి వీరేంద్ర భాజీల సూచనలతో హిందీ విభాగం ఆఫీస్ సూపరింటెండెంట్ సుదీప్త ఈ హిందీ క్యాలెండర్‌ను రూపొందించారు. హిందీ స్లోగన్స్‌ను క్యాలెండర్‌లో పొందుపరిచారు. అనంతరం ఎలక్ట్రికల్ లోకో షెడ్ వద్ద నిర్మించిన హిందీ లైబ్రరీని డీఆర్‌ఎం ప్రారంభించారు.

వైభవంగా సహస్ర ఘటాభిషేకం

- కనకమహాలక్ష్మి అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు
- ముగిసిన మార్గశిర మాసోత్సవాలు



సహస్ర ఘటాభిషేకం కోసం ఆలయ ప్రాంగణంలో సిద్ధం చేసిన కలశాలు

దాబాగార్డెన్స్: విశాఖవాసుల ఆరాధ్య దైవం కనకమహాలక్ష్మి అమ్మ వారి సన్నిధిలో మార్గశిర మాసోత్సవాలు గురువారంతో వైభవంగా ముగిశాయి. ముగింపు ఉత్సవాల్లో భాగంగా సహస్ర ఘటాభిషేకాన్ని కనులపండువగా జరిపించారు.
నెల రోజుల పాటు జరిగిన ఉత్సవాలకు లక్షలాదిగా భక్తులు తరలివచ్చారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే గాక రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చి, అమ్మవారిని దర్శించుకున్నారు. చివరి రోజైన గురువారం అమ్మవారికి యథావిధిగా శ్రీచక్ర నవవర్ణార్చన, లక్ష్మీహోమం, సామూహిక అష్టోత్తర పూజలు చేశారు. సాయంత్రం 4 గంటలకు ఆలయ ప్రాంగణంలో సహస్ర ఘటాభిషేకం నేత్రపర్వంగా జరిపించారు. ఈ సందర్భంగా సాయంత్రం 4 నుంచి రాత్రి 7.30 గంటల వరకు అమ్మవారి దర్శనాలు నిలిపివేశారు. అభిషేకం అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, ధర్మకర్తల మండలి మాజీ చైర్‌పర్సన్, ఉత్సవ కమిటీ సభ్యురాలు కొల్లి సింహాచలం, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ పాల్గొన్నారు.

భారీ అన్న సమారాధన

మార్గశిర మాసోత్సవాల ముగింపు సందర్భంగా 20 వేల మంది భక్తులకు అన్నసమారాధన జరిపారు. టౌన్‌కొత్తరోడ్డు జగన్నాథస్వామి ఆలయ మెయిన్‌రోడ్డు వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పరిసర ప్రాంతాల ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అమ్మవారి మాల విరమణ

కనకమహాలక్ష్మి మాల ధరించిన భక్తులు దీక్ష విరమణ చేశారు. మహా పూర్ణాహుతి సమర్పించిన అనంతరం మాలను విసర్జించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో మాలధారులు పాల్గొన్నారు.

సారా బట్టీలపై దాడులు



డ్రమ్ములలో నిల్వ ఉంచిన బెల్లం పులుపును ధ్వంసం చేసిన ఎ.కోడూరు పోలీసులు

- 300 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం



సారా తయారీకి సిద్ధం చేసిన పులుపుతో ఎస్‌ఐ రామారావు



కుముందానిపేట శివార్లలో పులుపు, నిల్వ చేసే డ్రమ్ములతో కొత్తకోట పోలీసులు

కోటవురట్ల : మండలంలోని రెండు గ్రామాల్లో గురువారం పోలీసులు దాడులు నిర్వహించి 4 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, 300 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశారు. ఎస్‌ఐ రమణయ్య తెలిపిన వివరాల ప్రకారం చినబొడ్డేపల్లి శివారు కె.కొత్తూరులో రాళ్ల తల్లి అనే వ్యక్తిని అరెస్టు చేసి 2 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. మరో కేసులో నీలిగుంట గ్రామ శివారున కన్నంరెడ్డి నానిబాబు, కన్నంరెడ్డి శ్రీను అనే ఇద్దరు వ్యక్తులు సారా తయారు చేస్తూ పట్టుబడ్డారు. వారి నుంచి 2 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని 300 లీటర్ల బెల్లం పులుపును, తయారీ సామగ్రిని ధ్వంసం చేశారు. ముగ్గురినీ అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

కొత్తభూమిలో...

కె.కోటపాడు : శృంగవరం శివారు కొత్తభూమి గ్రామంలో సారా తయారీ కేంద్రాలపై ఎ.కోడూరు పోలీసులు గురువారం దాడులను జరిపారు. ముందస్తు సమాచారం మేరకు ఎ.కోడూరు ఎస్‌ఐ జె.రమేష్ ఆధ్వర్యంలో సిబ్బంది గ్రామ శివార్లలో తనిఖీలను జరిపారు. ఈ తనిఖీలలో డ్రమ్ములలో సారా తయారీకి సిద్ధంగా నిల్వ ఉంచిన 200 లీటర్ల బెల్లం పులుపును గుర్తించి పోలీసులు ధ్వంసం చేసారు. సంఘటనా స్థలంలో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన వంట పాత్రలను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్టు ఎస్.ఐ రమేష్ తెలిపారు. దాడుల్లో పోలీస్ సిబ్బంది రాము, శ్రీను పాల్గొన్నారు.

రెండు గ్రామాల సరిహద్దులో...

నాతవరం : గుట్టు చప్పుడు కాకుండా సారా తయారీకి నిల్వ చేసిన 4వేల లీటర్ల పులుపును ధ్వంసం చేశామని నాతవరం ఎస్‌ఐ రామారావు అన్నారు. వెదురుపల్లి, కె.వి.శరభవరం గ్రామాల సరిహద్దులో సారా తయారు చేస్తున్న బట్టీలపై బుధవారం పోలీసులు దాడి చేశారు. పట్టుబడిన పులుపును సంఘటన స్థలంలోనే ధ్వంసం చేశామని, నిర్వాహకులు పరారయ్యారని ఎస్‌ఐ తెలిపారు. సారా తయారీకి ఉపయోగించిన సామాగ్రిని స్వాధీనం చేసుకున్నామన్నారు. మండల వ్యాప్తంగా సారా తయారీ విక్రయాలు చేసే 15మందిపై కేసు నమోదు చేశామన్నారు. సారా తయారీ చేసే గ్రామాలపై ప్రత్యేక నిఘా పెట్టామని అన్నారు. ఎక్కడైనా సారా తయారీ విక్రయాలు చేస్తున్నట్టుగా తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

రావికమతం : కొత్తకోట సీఐ అప్పలనాయుడు, ఎస్‌ఐ లక్ష్మణరావు సిబ్బందితో కలిసి గురువారం కుముందానిపేట గ్రామ శివారు తోటల్లో దాడులు చేశారు. ముందస్తు సమాచారంతో ఆ గ్రామ శివారు తోటల్లో దాడులు చేసి, సారా తయారీకి సిద్ధంగా ఉన్న 6వేల లీటర్ల పులుపును, డ్రమ్ములను, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. పులుపును ధ్వంసం చేసి డ్రమ్ములను తగుల బెట్టారు. పోలీసులు రావడం చూసి తయారీదారులు పరారయ్యారని ఈ సందర్భంగా సీఐ అప్పలనాయుడు తెలిపారు.

క్లుప్తంగా

వంతెన పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి

అనకాపల్లి : వంతెన నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి అన్నారు. పట్టణంలో యల్లయ్య కాలువపై జరుగుతున్న వంతెన పనులను గురువారం ఆమె పరిశీలించారు. 30 ఏళ్ల క్రితం వేసిన వంతెన శిథిలావస్థకు చేరుకుందని, రూ.38 లక్షలతో నూతనంగా వంతెన నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. మరో 50 సంవత్సరాల పాటు ప్రజలకు అందుబాటులో ఉండేలా నాణ్యతతో నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఈఈ చిరంజీవి, డీఈ వేణుగోపాల్, ఏఈ సుమిత్ర, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్ పాల్గొన్నారు.

చిన్నారుల సంక్రాంతి సందడి



సంప్రదాయ వేషధారణలో చిన్నారులు

అనకాపల్లి : స్థానిక ఉడ్‌పేట హ్యాపీ కిడ్స్ ప్లే స్కూల్లో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలు జరిగాయి. చిట్టిపొట్టి చిన్నారులు సంప్రదాయ వస్త్రధారణలో హాజరై హరిదాసు, గంగిరెద్దు, బుడబుక్కలు, కొమ్మదాసులు, రైతు వేషాల్లో అలరించారు. ఈ సందర్భంగా చిన్నారులు స్కూల్ ఆవరణలో భోగిమంట వేసి, నృత్యాలు చేసి పతంగులు ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ శెట్టి గిరీష్‌కుమార్, ప్రిన్సిపాల్ సునీత, సిబ్బంది, చిన్నారులు పాల్గొన్నారు.

వారపు సంతకు సంక్రాంతి కళ



కళకళలాడుతున్న వారపు సంత

కశింకోట: స్థానిక వారపు సంతకు గురువారం ముందుగానే సంక్రాంతి కళ వచ్చింది. నియోజకవర్గంలోని గ్రామాల నుంచి ఎక్కువ సంఖ్యలో ప్రజలు వచ్చి సంక్రాంతి పండగకు కావలసిన కూరగాయలు, వంట సరకులు కొనుగోలు చేశారు. దీంతో సంతలో చీరలు, రవికెలు, రెడీమేడ్ వస్త్రాలు విక్రయించే దుకాణాలు కళకళలాడాయి. కూరగాయల ధరలు దాదాపు స్థిరంగానే ఉన్నాయి. కిలో టమాటా రూ.25, ఉల్లిపాయ, క్యాబేజీ రూ.30, క్యారెట్, బీట్రూట్, వంకాయ, దొండకాయ రూ.60, బీన్స్, పచ్చి బఠాణీలు, బీరకాయ, బెండకాయ రూ.80కి విక్రయాలు సాగాయి.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 7,143 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,910	4,610
మొదటి రకం	3,710	4,070
రెండో రకం	3,660	3,920
మూడోరకం	3,430	3,650

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 58 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-4, బీ పాజిటివ్-18, ఓ పాజిటివ్-23, ఏబీ పాజిటివ్-8, బీ నెగిటివ్-1, ఓ నెగిటివ్-3, ఏబీ నెగిటివ్-1 యూనిట్ చొప్పున శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యు.లోకేష్‌ను 97036 19706 నంబర్‌లో సంప్రదించవచ్చు.

అనకాపల్లి సినిమాలు

బబుల్ గమ్	రాజా
కపాలదీవి	సత్యనారాయణస్క్రీన్-1
దీనమ్మ జీవితం	సత్యనారాయణస్క్రీన్-2
డెవిల్	షిర్డిసాయి
సలార్	పర్తిసాయి
రాఘవరెడ్డి	వెంకటేశ్వర
తికమక తాండ	శ్రీసత్య
సలార్	రామచంద్ర



నా పేరు బలిరెడ్డి శ్రీనివాస రావు. మా స్వగ్రామం పరవాడ మండలం మడకపాలెం. అనకాపల్లి ఉడ్‌పేట జీవీఎంసీ ఎలిమెంటరీ స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నా. ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలను ప్రైవేటు స్కూళ్లలో చదివించేందుకు ఆసక్తి చూపుతారు. నా ఇద్దరి పిల్లలు అనకాపల్లి మండలం అక్కిరెడ్డిపాలెం పంచాయతీ తారకరామారావు కాలనీ హైస్కూల్‌లో 6, 7 తరగతులు చదువుతున్నారు. ప్రభుత్వం పేద విద్యార్థుల మాదిరిగానే నా పిల్లలకు యూనిఫాం, పుస్తకాలు, భోజనం అందిస్తోంది.



నా పేరు ఎస్.సోమేష్. అనకాపల్లి మండలం సత్యనారాయణపురం పంచాయతీ ముత్రాసు కాలనీలో నివసిస్తున్నాను. వృత్తిరీత్యా టైలరింగ్ పనిచేస్తున్నాను. నాకు ఇద్దరు కుమార్తెలు. వేల్పులవీధి జీవీఎంసీ బాలికోన్నత హైస్కూల్‌లో పదో తరగతి, ఏడో తరగతి చదువుతున్నారు. ఆర్థికంగా వెనుకబడి ఉండడంతో ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చదివిస్తూ టైలరింగ్ ద్వారా వచ్చిన నగదుతో కుటుంబాన్ని పోషించుకోవడానికి సరిపోతోంది. ప్రభుత్వం అమ్మఒడి పథకాన్ని నా భార్య ఖాతాలో జమ చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లిష్ మీడియంలో బోధించడంతో నా ఇద్దరి పిల్లలు ఇంటి వద్ద ఇంగ్లిష్ మాట్లాడుతుంటే నాకెంతో సంతోషంగా ఉంది. నా ఇద్దరి ఆడపిల్లలకు ప్రభుత్వమే భరోసా కల్పిస్తుంది.

చూడచక్కగా సర్కారు బడి







ఆకర్షణీయంగా వేల్పుల వీధి జీవీఎంసీ బాలికోన్నత పాఠశాల, (ఇన్‌సెట్) ఉడ్‌పేట ఎలిమెంటరీ స్కూల్‌లో వాష్ బేసిన్ల వద్ద చేతులు శుభ్రం చేసుకుంటున్న విద్యార్థులు

గత టీడీపీ ప్రభుత్వంలో పేద పిల్లలు చదువుకోవాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. తల్లిదండ్రులకు వారి పిల్లలను ప్రైవేటు స్కూళ్లలో చదివించుకునే స్తోమత ఉండేది కాదు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సదుపాయాలు లేకపోవడంతోపాటు నాణ్యమైన విద్య అందకపోవడంతో చదువుకు దూరమయ్యేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యకు పెద్దపీట వేసింది. నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా పాఠశాలల రూపురేఖలను పూర్తిగా మార్చి కార్పొరేటర్ స్కూళ్లకు దీటుగా అన్ని రకాల సదుపాయాలు కల్పించింది.



ఆధునికీకరించిన తుమ్మపాల జెడ్పీ హైస్కూల్

- 'నాడు-నేడు'తో మారిన రూపురేఖలు
- రూ.కోట్ల నిధులతో వసతుల కల్పన
- విద్యార్థుల తల్లిదండ్రుల హర్షం

అనకాపల్లి: విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. బలహీన వర్గాల పిల్లలు ఉన్నత చదువులు చదువుకొని రాష్ట్రానికి, దేశానికి దిశా నిర్దేశం చేసేలా చర్యలు చేపట్టింది. పేద పిల్లలకు ఉన్నత నాణ్యమైన విద్య అందించాలనే దృఢసంకల్పంతో ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి సర్కారు బడులను సరికొత్తగా తీర్చిదిద్దింది. విద్యార్థుల ఆటల కోసం క్రీడా మైదానాలు ఏర్పాటు చేయడమే కాకుండా, పర్యావరణ పరిరక్షణలో పరిశుభ్రమైన ఆక్సిజన్ కూడా పీల్చుకునేలా పాఠశాలల రూపురేఖలను మార్పు చేశారు.



వేల్పుల వీధి హైస్కూల్‌లో ఊయల ఊగుతున్న విద్యార్థినులు

జీవీఎంసీ హైస్కూళ్లు	06
జెడ్పీ హైస్కూళ్లు	11
ఎయిడెడ్ హైస్కూళ్లు	01
జ్యోతిబాపూలే హైస్కూల్	01
జీవీఎంసీ ఎలిమెంటరీ స్కూళ్లు	20
ఎంపీపీ స్కూళ్లు	60
యూపీ స్కూళ్లు	08

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి.. నిధులు

- అనకాపల్లి పట్టణ, మండల పరిధిలో 107 ప్రభుత్వ పాఠశాలల్లో 10,065 మంది విద్యార్థులు చదువుతున్నారు.
- తొలి విడతలో 42 ప్రభుత్వ పాఠశాలలను రూ.11.21 కోట్లతో అభివృద్ధి చేశారు.
- రెండో దశలో 43 ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రూ.15.20 కోట్ల నిధులు విడుదల చేయగా నేటి వరకు రూ.5.50 కోట్లతో అభివృద్ధి చేస్తున్నారు.



ఉడ్‌పేట ఎలిమెంటరీ పాఠశాలలో బాలుర మోడ్రన్ టాయిలెట్

సత్తా చాటుతున్న క్రీడాకారులు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఆర్డీవో చిన్నికృష్ణ



క్రికెట్‌లో మండల స్థాయిలో విజయం సాధించిన ఏఎస్ పేట జట్టు

- ప్రతిష్టాత్మకంగా 'ఆడుదాం ఆంధ్రా'
- మండల స్థాయి పోటీల ప్రారంభంలో ఆర్డీవో చిన్నికృష్ణ

అనకాపల్లి: ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని ఆర్డీవో ఎ.జె.చిన్నికృష్ణ అన్నారు. స్థానిక డీసీఎంఎస్ ఆవరణలో గురువారం జరిగిన మండల స్థాయి పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రికెట్, ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్ క్రీడల్లో క్రీడాకారులు తమ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. అంతకుముందు ఖోఖో, కబడ్డీ పోటీలు జరుగుతున్న తీరును ఆయన పరిశీలించారు. జెడ్పీ ఎస్.వెంకటరమణ, క్రీడాకారులు పాల్గొన్నారు.
- పట్టణంలోని ఎన్టీఆర్ క్రీడా మైదానంలో క్రికెట్ పోటీలు, రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్, మండలంలోని తుమ్మపాలలో ఖోఖో, కబడ్డీ పోటీలు జరిగాయి. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, పంచాయతీ తట్టా పెంటయ్యనాయుడు, క్రీడాకారులు పాల్గొన్నారు.

నియోజకవర్గ స్థాయి పోటీలకు నాలుగు జట్లు

కశింకోట: ఆడుదాం ఆంధ్రాలో భాగంగా గురువారం మండల స్థాయిలో నిర్వహించిన మూడు ఆటల పోటీల్లో మహిళా జట్టు సహా నాలుగు జట్లు నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికయ్యాయి. కశింకోట బాలికల హైస్కూల్, బయ్యవరం హైస్కూల్, మండల పరిషత్ కార్యాలయం వద్ద క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ ఆటల్లో ఫైనల్ పోటీలు జరిగాయి. ఎంపీడీవో వి.వి.రవికుమార్, ఎంఈవో మూర్తి, స్థానిక హైస్కూల్ పీడీలు వి.ప్రభాకరరావు, పెంటకోట కమల, బయ్యవరం పీడీ కృష్ణల పర్యవేక్షణలో బాలికల హైస్కూల్‌లో వాలీబాల్ పోటీలు నిర్వహించగా.. తాళ్లపాలెం సచివాలయం-2 పురుషుల జట్టు, ఏఎస్ పేట మహిళా జట్టు, మండల పరిషత్ వద్ద నిర్వహించిన బ్యాడ్మింటన్ పోటీల్లో ఇ.చౌడువాడ జట్టు, క్రికెట్‌లో ఏఎస్ పేట జట్టు విజయం సాధించాయి. ఈ మేరకు నియోజకవర్గ స్థాయి పోటీలకు క్రీడాకారులు ఎంపికయ్యారు.



నియోజకవర్గ పోటీలకు ఎంపికైన ఇ.చౌడువాడ బ్యాడ్మింటన్ జట్టు



కశింకోట బాలికల హైస్కూల్ గ్రౌండ్‌లో వాలీబాల్ ఆడుతున్న పురుషుల జట్టు



డీసీఎంఎస్ ఆవరణలో కబడ్డీ ఆడుతున్న బాలురు

నేడు కబడ్డీ, ఖోఖో పోటీలు

బాలికల హైస్కూల్‌లో శుక్రవారం మండల స్థాయి కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహించనున్నట్లు పీడీ కమల తెలిపారు. మండలంలోని సచివాలయాల వారీగా ఆటకు 20 జట్లు వంతున రానున్నట్లు చెప్పారు.

కనకమహాలక్ష్మికి లక్ష కుంకుమార్చన

కశింకోట : మండలంలోని బయ్యవరంలో కనకమహాలక్ష్మి అమ్మవారికి లక్ష కుంకుమార్చన ఘనంగా నిర్వహించారు. మార్గశిర మాసోత్సవాల ముగింపును పురస్కరించుకుని గురువారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. మార్కెట్ కమిటీ అధ్యక్షుడు, ఆలయ కమిటీ అధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, సర్పంచ్ గొల్లవిల్లి జయ, ఎంపీటీసీ సభ్యుడు గొన్నా నాగ సత్యనారాయణ, వార్డు సభ్యులు గొన్నా నార్ని శ్రీనివాసరావు, గొల్లవిల్లి బాబూరావు, గొల్లవిల్లి నానాజీ తదితరులు పాల్గొన్నారు.



కనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్, నాయకులు

ఆలయానికి పోటెత్తిన భక్తులు

కశింకోట: కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం గురువారం భక్తులతో కళకళలాడింది. మార్గశిర మాసోత్సవాల ముగింపును పురస్కరించుకుని అమ్మవారి విగ్రహానికి క్షీరాభిషేకం చేసి ఆభరణాలు, పూలతో అలంకరించారు. కరెన్సీ నోట్ల మాల వేశారు. ఆలయ అర్చకులు వి. చిదంబరం, వి. కృష్ణ ప్రత్యేక కుంకుమార్చనలు చేశారు. నియోజకవర్గంతో పాటు చుట్టు పక్కల గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ భీశెట్టి కుమార్, మాజీ చైర్మన్ సూరిశెట్టి భరణీకుమార్, ప్రతినిధులు వేగి వెంకటరావు, సూరిశెట్టి రేవతి, తదితరులు పాల్గొన్నారు.



కనకమహాలక్ష్మి అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకుడు కృష్ణ

వైఎస్సార్ బీమా పత్రాల అందజేత

అనకాపల్లి : వైఎస్సార్ బీమా బాధితులకు అండగా నిలుస్తుందని 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత, జానకీరామరాజు దంపతులు అన్నారు. వారి స్వగృహంలో గురువారం స్థానిక జయరామరాజుపేటకు బాధిత కుటుంబ సభ్యులకు రూ.90 వేల బీమా సొమ్ము పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడుమాసాల క్రితం బొండాడ నూకరాజు దురదృష్టవశాత్తు మరణించడంతో ఆ సమయంలో రూ.10 వేలు అందించగా మిగిలిన సొమ్ము పత్రాన్ని అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పలకా సత్యనారాయణ, పార్టీ శ్రేణులు ఆడారి శ్రీనివాసరావు, కోన ఉమ, డొంక సత్తిబాబు, పేరూరి కల్యాణ్, చింతా రాంజీ, మృతుడి తల్లి రమణమ్మ, తమ్ముడు శ్రీను పాల్గొన్నారు.



బాధిత కుటుంబ సభ్యులకు బీమా పత్రాలు అందిస్తున్న సునీత, జానకీరామరాజు దంపతులు

గౌరీపరమేశ్వరుల ఉత్సవ పోస్టర్ ఆవిష్కరణ

అనకాపల్లి : స్థానిక వేల్పులవీధి గౌరీపరమేశ్వర మహోత్సవ జాతరను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు వాకాడ బాబు, కార్యదర్శి మద్దాల నూకరాజు చెప్పారు. ఆలయ ఆవరణలో గురువారం ఉత్సవ కరపత్ర ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి, జాజుల రమేష్ దంపతులు కరపత్రాన్ని ఆవిష్కరించారు. అంతకు ముందు కార్పొరేటర్ దంపతులను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు శీరంశెట్టి నరసింగరావు, కోశాధికారి వేల్పుల గణేష్, శంకర్ల పద్మ, వీధిపెద్దలు మద్దాల కూర్మారావు, మద్దాల రమణబాబు, నల్లల రాజు, ముమ్మిన సూరిబాబు, బొండా శంకరరావు, ఉగ్గిన అప్పారావు, కొంకి శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.



ఉత్సవ కరపత్రం ఆవిష్కరిస్తున్న ప్రసన్నలక్ష్మి, రమేష్ దంపతులు

30 మద్యం సీసాలు స్వాధీనం

కశింకోట: మండలంలోని ఇ.చౌడువాడలో అక్రమంగా మద్యం తరలిస్తున్న ఓ యువకుడిని పట్టుకొని అరెస్టు చేసినట్లు సీఐ వినోద్ బాబు గురువారం రాత్రి తెలిపారు. మాకవరపాలెం మండలం రాజుపేటకు చెందిన పైల రమేష్ 30 మద్యం సీసాలను విక్రయానికి తరలిస్తుండగా పట్టుకుని స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

కార్మికుల సమ్మె విరమణతో హర్షాతిరేకాలు



విధులకు హాజరై చెత్త తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు



శుభ్రపడిన పరిసరాలు

అనకాపల్లి : జీవీఎంసీ పారిశుధ్య కార్మికుల సమ్మెకు గురువారం ప్రభుత్వం తెర దించింది. దీంతో అన్నివర్గాల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిసాయి. ఇళ్లలో నిల్వ చేసిన తడి-పొడి చెత్త తరలింపుతో పాటు కార్మికుల సమస్యలు పరిష్కరించడంతో ప్రభుత్వ పాలన భేష్ అనే వాదన వినిపిస్తోంది. ఈ సందర్భంగా సమ్మె శిబిరం వద్ద సీఐటీయూ సీనియర్ నేతలు గంటా శ్రీరాం, ఆర్.శంకరరావు జోనల్ కమిషనర్ ఎస్.వెంకటరమణతో మాట్లాడారు. ప్రభుత్వం కార్మిక సమస్యల పరిష్కారానికి కృషి చేయడం అభినందనీయమన్నారు. సీఐటీయూ నాయకుడు జి.సత్యనారాయణ, కార్మిక నేతలు బొమ్మాల రాము, నిమ్మకాయల అజయ్‌కుమార్, నూకరాజు, శివకుమార్, సంతోష్, గణేష్, శ్రీను, లక్ష్మణరావు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద జయంత్యుత్సవాలు ప్రారంభం



ఉత్సవాలను ప్రారంభిస్తున్న తహసీల్దార్ సురేష్‌నాయుడు

కశింకోట: కశింకోటలోని వివేకానంద హైస్కూల్‌లో గురువారం స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల సందర్భంగా స్వామి వివేకానంద చిత్రపటానికి తహసీల్దార్ కె.సురేష్‌నాయుడు పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు సర్టిఫికెట్లు, షీల్డ్‌లు అందజేసి సత్కరించారు. కరస్పాండెంట్ మళ్ల జగదీష్, ప్రిన్సిపాల్ శైలజ ఆధ్వర్యంలో జరిగిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి.

ఆకట్టుకున్న కవి సమ్మేళనం



కవి సమ్మేళనంలో సాహితీ మిత్రులు



నూకరత్నంకు వస్త్రాలు అందిస్తున్న సాహితీవేత్తలు

అనకాపల్లి : స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం సాహితీ సంస్థ ఆధ్వర్యంలో సంక్రాంతి లక్ష్మికి స్వాగతం పేరిట కవి సమ్మేళనం జరిగింది. రచయిత్రి రేగురగడ్డ వెంకటలక్ష్మి గాయత్రి హిందీ దివస్‌ను పురస్కరించుకుని సూక్ష్మ రామాయణ గానంతో స్వీయ కవిత వినిపించారు. కవి మాధవీ సనారా మాట్లాడుతూ సాహితీ సంస్థకు కన్వీనర్‌గా 13 సంవత్సరాలు సేవలందించేందుకు తోడ్పాటునందించిన మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. కవి, కథా రచయిత గొంతిన రంగబాబు జీవితం శీర్షికతో కవిత చదివి వినిపించారు. నూతన కన్వీనర్ బాధ్యతలను రంగబాబుకు మిత్రులు అప్పగించారు. అంతకు ముందు గ్రంథాలయ సహాయకురాలు నూకరత్నంకు నూతన వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సాహితీమిత్రులు డాక్టర్ యిమ్మిడిశెట్టి చక్రపాణి, కేఎస్ఈ శ్రీనివాసరావు, కర్రి మల్లీశ్వరి, జీఎస్‌కే సాయిబాబా, బుద్ధ వీరునాయుడు, దేవరకొండ లక్ష్మీనారాయణ, జీఎల్ఎస్ శాస్త్రి, బల్లా నాగభూషణం, గ్రంథాలయ అధికారి కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బెల్లం పాక దగ్ధం



కాలిపోతున్న బెల్లం పాక



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కశింకోట: స్థానిక శారదా నది అవతల ఉన్న పొలాల్లో గురువారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో బెల్లం పాక దగ్ధమైంది. సుమారు రూ. రెండు లక్షల ఆస్తి నష్టం జరిగిందని అంచనా. బొడ్డేడ శ్రీనుకు చెందిన బెల్లం తయారీ పాకకు అకస్మాత్తుగా నిప్పు అంటుకుని కాలిపోయింది. పాకలో తయారు చేసిన రెండు పాకాల బెల్లం కూడా ఆహుతైంది. రెండు మోటార్లు కాలిపోయాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల గాని, ప్రమాదవశాత్తు గానీ అగ్ని ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. అనకాపల్లి నుంచి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ప్రమాద స్థలాన్ని వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు పెంటకోట శ్రీనివాసరావు పరిశీలించారు.